సాక్షి
ఏలూరు
శనివారం । 25 । మే । 2024



సెలవులు సద్వినియోగమయ్యేలా..

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా శాఖా గ్రంథాలయాల్లో విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరాలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. 8లో ▸



ధర్మ పరిరక్షణతోనే మనుగడ

హిందూ ధర్మ పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని పండితులు అన్నారు. చిన వెంకన్న క్షేత్రంలో వేద సభను ఘనంగా నిర్వహించారు. 8లో ▸



బాస్కెట్‌బాల్‌లో జయకేతనం

అంతర జిల్లాల యూత్ బాస్కెట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బాలుర జట్టు విజేతగా నిలిచింది. బాలికల జట్టు తృతీయ స్థానం సాధించింది. 8లో ▸

రైతు సంక్షేమానికి ప్రాధాన్యం

- 2 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు
- రూ.241.59 కోట్ల చెల్లింపులు
- 30 వరకు ధాన్యం సేకరణ
- ఖరీఫ్‌కు వ్యవసాయశాఖ సిద్ధం
- ఈవీఎంలకు పటిష్ట భద్రత
- 'సాక్షి'తో జేసీ లావణ్యవేణి



ఏలూరు (మెట్రో): జిల్లావ్యాప్తంగా ధాన్యం కొనుగోలులో ఎటువంటి ఇబ్బందులు తలెత్తలేదని, ఈ నెల 30 వరకు ధ్యానం సేకరిస్తామని జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి చెప్పారు. ఈ మేరకు ఆమె 'సాక్షి'తో మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా 2.40 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అంచనా వేశామని, ఇప్పటివరకు 2 లక్షల టన్నులు కొనుగోలు చేశామన్నారు. డిమాండ్ కలిగిన విత్తనాన్ని రైతులు సాగు చేయడంతో అనుకున్న మేరకు కొనుగోలుకు ధాన్యం రాలేదన్నారు. జిల్లావ్యాప్తంగా 17,198 మంది రైతులు తమ ధాన్యాన్ని విక్రయించారని, రైతులకు ఇబ్బందులు లేకుండా కళ్లాల్లోనే ధాన్యం కొనుగోలు చేసి ఎప్పటికప్పుడు సొమ్ములు చెల్లించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. రూ.434.76 కోట్ల ధాన్యం కొనుగోలు చేయగా, దీనిలో ఇప్పటివరకు రూ.241.59 మేర కోట్ల చెల్లింపులు చేశామని, మిగిలిన వారికి వారం పది రోజుల్లో సొమ్ములు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జేసీ చెప్పారు. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా మిల్లర్ల వద్ద నుంచి బియ్యాన్ని సేకరించే పనిలో ఉన్నామని, ఇప్పటికే 25 శాతం సీఎంఆర్ పూర్తయ్యిందన్నారు. నెల రోజుల్లో నూరు శాతం సీఎంఆర్ ప్రక్రియను పూర్తి చేసేలా మిల్లర్ల వద్ద నుంచి బియ్యం సేకరించేందుకు చర్యలు తీసుకుంటామని ఆమె వివరించారు.



టి.నరసాపురంలోని గ్రీన్‌ఫీల్డ్ హైవేపై ఆరబెట్టిన ధాన్యం (ఫైల్)

ఖరీఫ్ ప్రణాళిక సిద్ధం : జిల్లావ్యాప్తంగా ఖరీఫ్ నారుమడులు, ఖరీఫ్‌కు వరి విత్తనాలు అందించేందుకు వ్యవసాయ శాఖ సిద్ధంగా ఉందని జేసీ లావణ్యవేణి తెలిపారు. ఖరీఫ్‌కు సంబంధించి ఇప్పటికే రైతులకు 10,800 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలను అందించేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. మరో 18 వేల క్వింటాళ్ల వరి విత్తనాలను సైతం సిద్ధం చేశామన్నారు. పచ్చిరొట్ట విత్తనాలను 50 శాతం సబ్సిడీపై రైతులకు అందిస్తున్నామని, గిరిజన ప్రాంతాల్లో 90 శాతం సబ్సిడీతో అందించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. జూన్ రెండో వారానికి నారుమడులు వేసేలా వ్యవసాయ శాఖ ప్రణాళికలు రూపొందించిందన్నారు.

కెమెరాల నిఘాలో స్ట్రాంగ్‌రూమ్‌లు

జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ముగిసిందని జేసీ లావణ్యవేణి తెలిపారు. జూన్ 4న ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియను ప్రారంభిస్తామన్నారు. మూడంచెల అంచెల భద్రత నడుమ స్ట్రాంగ్ రూమ్‌లో ఈవీఎంలను భద్రపరిచామని, మొదటి అంచెలో కేంద్ర పారామిలటరీ భాగాలు, రెండో అంచెలో రాష్ట్ర పారామిలటరీ బలగాలు, మూడో అంచెలో రాష్ట్ర పోలీసు బలగాల నడుమ ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌లో ఉంచామన్నారు. 96 కెమెరాల మధ్య నిరంతరం నిఘా ఉంటుందని చెప్పారు. జిల్లాలో ప్రతి నియోజకవర్గంలో ఓట్ల లెక్కింపులో భాగంగా ర్యాండమ్‌గా ఐదు వీవీప్యాట్‌లను సైతం లెక్కిస్తామన్నారు. ప్రతి నియోజకవర్గానికి ఎన్నికల కమిషన్ నియమించిన ఒక అబ్జర్వర్, ప్రత్యేక పరిశీలకులు ఉంటారన్నారు. ఇప్పటికే కౌంటింగ్ కేంద్రాలకు, ఆయా పార్టీల ఏజెంట్ల నియమించుకోవాలని, సమావేశాలను సైతం ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్‌లను అనుమతించమన్నారు. జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని పోలింగ్ మాదిరిగా ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ పూర్తిచేసేలా యంత్రాంగం సర్వ సన్నద్ధంగా ఉందని జేసీ లావణ్యవేణి వివరించారు.

కౌంటింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్



ర్యాండమైజేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న దృశ్యం

ఏలూరు(మెట్రో): సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఓట్ల లెక్కింపునకు సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తిచేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. జూన్ 4న నిర్వహించనున్న ఓట్ల లెక్కింపునకు కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లకు ర్యాండమైజేషన్ ప్రక్రియను శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గం, 7 అసెంబ్లీ నియోజకవర్గాలకు కౌంటింగ్ నిర్వహిస్తామన్నారు. 289 మంది కౌంటింగ్ సూపర్‌వైజర్లు, 340 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు, 309 మంది మైక్రో అబ్జర్వర్లు మొత్తంగా 938 మంది సిబ్బంది ర్యాండమైజేషన్‌ను పారదర్శకంగా నిర్వహించామన్నారు. డీఆర్వో డి.పుష్పమణి, కలెక్టరేట్ ఏఓ కె.కాశీవిశ్వేశ్వరరావు, ఎన్ఐసీడ డీఐఓ శర్మ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ప్రావిడెంట్ ఫండ్ బ్యాలెన్స్ షీట్లు విడుదల చేయాలి



జెడ్పీ సీఈఓతో మాట్లాడుతున్న పీఆర్టీయూ అధ్యక్షుడు ఆంజనేయులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాపరిషత్ ప్రావిడెంట్ ఫండ్ బ్యాలెన్స్ షీట్లు వెంటనే విడుదల చేయాలని కోరుతూ పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు జెడ్పీ సీఈఓ కేఎస్ఎస్ సుబ్బారావుకు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. గత నాలుగు ఆర్థిక సంవత్సరాలుగా పీఎఫ్ బ్యాలెన్స్ షీట్లు విడుదల చేయకపోవడానికి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. సుమారు 7,700 మంది పీఎఫ్ ఖాతాదారులైన ఉద్యోగ, ఉపాధ్యాయులు వారి ఖాతాల్లో వివరాలు తెలియక ఆందోళన చెందుతున్నారని అన్నారు. పదవీ విరమణ పొందుతున్న వారు కూడా ఇబ్బంది పడుతున్నారన్నారు. దీనిపై సీఈఓ స్పందిస్తూ తాను బాధ్యతలు తీసుకున్న నాటి నుంచి దీనిపై కసరత్తు చేస్తున్నామని, ఇదే ప్రథమ ప్రాధాన్యతగా భావించి చర్యలు తీసుకుంటున్నామని, త్వరలోనే బ్యాలెన్స్ షీట్లు విడుదల చేయిస్తానని హామీ ఇచ్చారు.

ఇంటర్ సప్లిమెంటరీకి 1,966 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ థియరీ పరీక్షలు శుక్రవారం జిల్లాలోని 27 కేంద్రాల్లో ప్రారంభమయ్యాయి. ఉదయం ఫస్టియర్, మధ్యాహ్నం సెకండియర్ విద్యార్థులు తెలుగు, సంస్కృతం, హిందీ, ఉర్దూ పరీక్షలు జరిగాయి. ఫస్టియర్ పరీక్షలకు 1,537 మంది జనరల్ విద్యార్థులకు 1,397 మంది, 182 మంది ఒకేషనల్ విద్యార్థులకు 159 మంది హాజరయ్యారు. మొత్తంగా 1,719 మందికి 1556 మంది హాజరయ్యారు. అలాగే సెకండియర్ పరీక్షలకు 259 మంది జనరల్ విద్యార్థులకు 218 మంది, 221 మంది ఒకేషనల్ విద్యార్థులకు 192 మంది హాజరయ్యారు. మొత్తంగా 480 మందికి 410 మంది హాజరయ్యారు. తొలిరోజు పరీక్షల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదని పరీక్షల కన్వీనర్ బి.ప్రభాకరరావు తెలిపారు.

తల్లీకూతుళ్ల ప్రతిభ



సచ్చిదానంద స్వామి చేతులమీదుగా మెడల్స్ అందుకుంటున్న లక్ష్మీ నాగనిర్మల, లక్ష్మీ నాగచేతన

టి.నరసాపురం: భగవద్గీత పారాయణం పోటీల్లో టి.నరసాపురానికి చెందిన తల్లీకూతుళ్లు ప్రతిభ కనబర్చి గణపతి సచ్చిదానంద స్వామి చేతుల మీదుగా పతకాలు, సర్టిఫికెట్లు అందుకున్నారు. మైసూర్‌లోని దత్త పీఠం వద్ద దత్త వేంకటేశ్వరస్వామి ఆలయ 25వ బ్రహ్మోత్సవ కార్యక్రమంలో భాగంగా భగవద్గీత పారాయణ పోటీలు ఆన్‌లైన్ ద్వారా నిర్వహించారు. టి.నరసాపురం నుంచి కొనకళ్ల లక్ష్మీనాగనిర్మల, ఆమె కుమార్తె లక్ష్మీ నాగచేతన పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా పలువురు పోటీల్లో పాల్గొనగా నాగనిర్మల ఉత్తమ శ్రేణి డిస్టింక్షన్, నాగచేతన ప్రథమ శ్రేణిలో నిలిచి ప్రతిభ కనబర్చారు. తల్లీకూతుళ్లు ఇద్దరు ఏడాదిన్నరగా ఆన్‌లైన్‌లో భగవద్గీత శ్లోకాలు ఉపాధ్యాయుల ద్వారా చదవడం నేర్చుకుని కంఠస్థం చేశారు. లక్ష్మీ నాగనిర్మల మాట్లాడుతూ భగవద్గీత 18 అధ్యాయాల్లోని 700 శ్లోకాలను కంఠస్థం చేసినట్టు చెప్పారు. భగవద్గీత పారాయణ ద్వారా ఆధ్యాత్మికత పెరగడంతో పాటు విలువలతో కూడిన జీవితం అలవడుతుందన్నారు.

ప్రశాంతంగా టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జిల్లావ్యాప్తంగా శుక్రవారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్-1 పరీక్షకు 4,004 మంది విద్యార్థులకు 1,498 మంది హాజరయ్యారు. విద్యార్థుల హాజరు శాతం 37.41గా ఉంది. 17 కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్, 4 కేంద్రాలను జిల్లా విద్యాశాఖాధికారి, 6 కేంద్రాలను ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ కలిపి మొత్తం 27 పరీక్షా కేంద్రాల్లో తనిఖీ చేశారు. తొలిరోజు ఎక్కడా ఎటువంటి మాల్‌ప్రాక్టీస్ కేసు నమోదు కాలేదని డీఈఓ ఎస్.అబ్రహం తెలిపారు.

ఫెర్రీ వేలం

పోలవరం రూరల్: పట్టిసం శివక్షేత్రం రేవులో ఫెర్రీ వేలం నిర్వహించినట్టు పంచాయతీ కార్యదర్శి టి.విజయకుమారి తెలిపారు. శుక్రవారం సర్పంచ్ సబ్బారపు శ్రీరామమూర్తి అధ్యక్షతన 2024-25కు ఫెర్రీకి బహిరంగ వేలం నిర్వహించారు. ఎం.సత్యనారాయణ అనే వ్యక్తి వేలం పాటలో రూ.11.70 లక్షలకు ఫెర్రీని దక్కించుకున్నట్లు విజయకుమారి తెలిపారు.

మొక్కలతో వాతావరణ సమతుల్యం

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు(మెట్రో): పర్యావరణ సమతుల్యానికి, ఆరోగ్యకరమైన నగర వాతావరణాన్ని నిర్వహించేందుకు మొక్కలు నాటి పెంచాలని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అన్నారు. శుక్రవారం నగరంలో పలు ప్రాంతాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. నగరంలోని తంగెళ్లమూడి-జంగారెడ్డిగూడెం రోడ్డు, సీఆర్ఆర్ కళాశాల వద్ద, అశోక్‌నగర్, పంపుల చెరువు తదితర ప్రాంతాల్లో కుటుంబ సమేతంగా ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏలూరు నగరంలో మామిడి, జామ, నేరేడు వంటి ఫల రకాల మొక్కలతోపాటు రావి తదితర 400 మొక్కలను నాటుతున్నట్టు చెప్పారు. ఈ మొత్తాన్ని తాను స్వయంగా అందిస్తున్నానన్నారు. వీటికి ట్రీగార్డ్స్ అమర్చి పెంపకం విషయంపై అధికారుల పర్యవేక్షణ ఉంటుందన్నారు. కలెక్టర్ సతీమణి మానస మాట్లాడుతూ మొక్కల పెంపకం ఆవశ్యతకను చిన్నతనం నుంచే పిల్లలకు తెలియజేయాలన్నారు. డీఆర్వో డి.పుష్పమణి, ఆర్డీఓ ఎన్ఎస్‌కే ఖాజావలీ, కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ, డ్వామా పీడీ ఎ.రాము, డీఎఫ్‌ఓ శైలజ పాల్గొన్నారు.



ఏలూరులో మొక్కలు నాటుతున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

నష్ట నివారణపై అవగాహన పెంచాలి

ప్రకృతి వైపరీత్యాలు, అగ్నిప్రమాద సమయంలో ఆస్తి, ప్రాణనష్టాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజల్లో అవగాహన పెంచాలని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అన్నారు. నగరంలోని రాష్ట్ర విపత్తుల స్పందన, అగ్నిమాపక శాఖ కార్యాలయాన్ని ఆమె సందర్శించి అగ్నిమాపక వాహనాలు, వాటర్ బోట్లను పరిశీలించారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని వాహనాలు, బోట్లను సిద్ధం చేసుకోవాలన్నారు. జిల్లాలో కుక్కునూరు, వేలేరుపాడు, పోలవరం మండలాల్లో వరదల సమయంలో మెరుగైన సేవలందించారని సిబ్బందిని కొనియాడారు. జిల్లా ఫైర్ ఆఫీసర్ సీహెచ్ రత్నబాబు మాట్లాడుతూ జిల్లాలో 6 రాష్ట్ర విపత్తుల స్పందన, అగ్నిమాపక శాఖల కార్యాలయాలు ఉన్నాయని, వాటిలో 8 అగ్నిమాపక నివారణ వాహనాలు ఉన్నాయన్నారు. అత్యవసర పరిస్థితిలో వినియోగానికి యంత్ర పరికరాలు, వాటర్ బోట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. జాగ్రత్త చర్యలపై జిల్లాలోని పరిశ్రమలు, ప్రజానివాస ప్రాంతాల్లో డెమో ప్రదర్శనలు ఇస్తున్నామన్నారు. అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ వి.రామకృష్ణ ఉన్నారు.

స్ట్రాంగ్‌రూమ్స్‌కు మూడంచెల భద్రత

ఏలూరు టౌన్: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఈవీఎం బాక్సులను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్స్ వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి అన్నారు. ఏలూరు సర్ సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో స్ట్రాంగ్‌రూమ్స్ వద్ద భద్రతా ఏర్పాట్లను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర సాయుధ బలగాలతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని, నిరంతరం సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని ఆదేశించారు. జిల్లాలోని పోలీస్ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేస్తూ విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది అప్రమత్తంగా ఉన్నది లేనిదీ తనిఖీ చేస్తారని తెలిపారు. జిల్లావ్యాప్తంగా కార్డెన్, సెర్చ్‌లు నిర్వహిస్తున్నామని అనుమానిత వ్యక్తులు, అసాంఘిక చర్యలకు పాల్పడే అవకాశాలు ఏమైనా ఉన్నాయా అనే అంశాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి తెలిపారు. గురువారం మధ్యాహ్నం నుంచి శుక్రవారం మధ్యాహ్నం వరకు ఏలూరు జిల్లాలో 17 చోట్ల కార్డెన్, సెర్చ్ నిర్వహించామని, ఈ తనిఖీల్లో 140 మోటారుసైకిళ్లను సీజ్ చేసినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు.



స్ట్రాంగ్ రూమ్ వద్ద పరిశీలిస్తున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

డీవైఈఓ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

డీఆర్వో పుష్పమణి



ఏలూరు(మెట్రో): ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ (డీవైఈఓ) పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తిచేసినట్టు జిల్లా రెవెన్యూ అధికారి, జిల్లా పరీక్షా సమన్వయ అధికారి డి.పుష్పమణి తెలిపారు. శుక్రవారం ఆమె చాంబర్‌లో శనివారం జరుగనున్న డీవైఈఓ పరీక్ష నిర్వహణపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏలూరులోని సిద్ధార్థ క్వెస్ట్ సీబీఎస్ స్కూల్, ఏలూరు ఇంజనీరింగ్ టెక్నాలజీ కళాశాలలో పరీక్షలు నిర్వహిస్తారన్నారు. మొత్తంగా 320 మంది అభ్యర్థులు హాజరుకానున్నారన్నారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే పరీక్షలకు ఉదయం 8.30 గంటలలోపు అభ్యర్థులు కేంద్రాల్లోకి చేరుకోవాలని సూచించారు. మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదన్నారు. ఒక్కో కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంట్, లైజన్ ఆఫీసర్‌ను నియమించామన్నారు. ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ ఎ.కృష్ణవేణి (మోనిటర్), అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ ఎస్.కస్తూరి పరీక్ష నిర్వహణ అధికారులుగా నియమించారన్నారు.

వేడుకగా శ్రీచక్రస్నానం

నేటితో ముగియనున్న చినవెంకన్న బ్రహ్మోత్సవాలు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల వేంకటేశ్వర స్వామి వైశాఖమాస దివ్య బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీచక్ర స్నానం వేడుకను నేత్రపర్వంగా జరిపించారు. ముందుగా అర్చకులు ఆలయ యాగశాలలో శ్రీవారు, అమ్మవార్లు, శ్రీచక్ర పెరుమాళ్ల ఉత్సవ మూర్తులను వేదికపై వేంచేపు చేశారు. పూజాదికాల అనంతరం సుగంధ ద్రవ్యాలు, పంచ పల్లవులు, శ్రీచందనం, పసుపు, మంత్రపూత అభిషేక తీర్థంతో శ్రీచక్ర స్వామిని అభిషేకించారు. అనంతరం శ్రీచక్ర పెరుమాళ్లతో పాటు ఉభయ నాంచారులకు, శ్రీవారికి తిరుమంజనాలు జరిపి హారతులిచ్చారు. అభిషేక జలాన్ని భక్తుల శిరస్సులపై చల్లారు. సాయంత్రం ఆలయంలో నిత్య హోమ బలిహరణలు, పూర్ణాహుతి, అనంతరం ధ్వజ అవరోహణ వేడుకలను అర్చకులు వేద మంత్రోచ్ఛరణలతో వైభవోపేతంగా జరిపారు. ఆలయ ముఖ మండపంలో శ్రీవారి మురళీకృష్ణ అలంకారం భక్తులకు కనువిందు చేసింది. రాత్రి స్వామి వారికి అశ్వవాహనంపై తిరువీధి సేవను ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. శనివారం రాత్రి జరిగే శ్రీపుష్ప యాగోత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని, ఆదివారం నుంచి ఆలయంలో నిత్యార్జిత కల్యాణాలు, ఆర్జిత సేవలను పునరుద్ధరిస్తామని దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు తెలిపారు.



శ్రీ చక్రస్నానం వేడుక జరిపిస్తున్న అర్చకులు



అశ్వవాహనంపై ఊరేగింపు

బ్రహ్మోత్సవాల్లో నేడు

- ఉదయం 7 గంటల నుంచి భజనలు
- ఉదయం 9 గంటల నుంచి శ్రీవారికి చూర్ణోత్సవం, వసంతోత్సవం
- ఉదయం 10 గంటల నుంచి భక్తిగీతాలు ఆలాపన
- సాయంత్రం 4 గంటల నుంచి నాదస్వరకచేరి
- సాయంత్రం 5 గంటల నుంచి కూచిపూడి నృత్య ప్రదర్శనలు
- రాత్రి 7 గంటల నుంచి ద్వాదశ కోవెల ప్రదక్షిణలు, శ్రీపుష్ప యాగం-పవళింపు సేవ

రాత్రి 9 గంటల నుంచి - నాటక ప్రదర్శన

ప్రత్యేక అలంకారం : శయన మహావిష్ణువు

401 ఆలయాల నిర్మాణానికి ప్రభుత్వం కృషి

భీమవరం(ప్రకాశంచౌక్): రాష్ట్రంలో 401 ఆలయాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. శుక్రవారం భీమవరం డీఎన్నార్ కళాశాల క్రీడా మైదానంలో జరుగుతున్న అతిరాత్ర మహాయాగ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం వచ్చినా ఈ విషయంలో బాధ్యత తీసుకుని నిర్మాణాలు చేపట్టాలని అన్నారు. అతిరాత్ర మహాయాగం ఇంత అద్భుతంగా నిర్వహించిన జంధ్యాల శ్రీనివాస సుబ్రహ్మణ్యశర్మను, సహకరించిన వారిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో యజ్ఞకర్త జంధ్యాల శ్రీనివాస సుబ్రహ్మణ్య శర్మ, కర్ణాటక రుత్వికులు కేశవ స్వామియాజీ, విశ్వనాథ శర్మలను సత్కరించారు.



మాట్లాడుతున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

వచ్చేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే..

- పందేలకు సై.. సై..
- పెరుగుతున్న బెట్టింగ్‌లు
- పత్తాలేని కూటమి సానుభూతిపరులు

తాడేపల్లిగూడెం/తణుకు: రాష్ట్రంలో వచ్చేది.. సంక్షేమ పాలన ఇచ్చేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే అంటూ జిల్లాలో బెట్టింగులు జోరందుకున్నాయి. పోలింగ్ ముగిసిన రోజున డాంబికాలు పోయి, హంగామా సృష్టించిన కూటని నేతలకు భంగపాటు తప్పదని విశ్లేషకులు చెబుతున్నారు. దీంతో కూటమి గెలుస్తుందని కోసు పందాలు, ఒకటికి రెండు, ఒకటికి మూడు, ఐదు అంటూ హైప్ క్రియేట్ చేసిన వారంతా వారం రోజులుగా పత్తాలేకుండా పోయారు. తాజా పరిణామాలు, పోలింగ్ విశ్లేషణలు బయటకు వచ్చిన తర్వాత బెట్టింగ్‌రాయుళ్ల హడావుడి తగ్గింది. వైఎస్సార్‌సీపీ మరలా అధికారం చేపడుతుందని చాలెంజ్ చేస్తే.. కూటమి అభిమానులు, పందాలరాయుళ్లు పత్తాలేకుండా పోతున్నారు. రాయలసీమ, కడప ప్రాంతాల నుంచి వచ్చిన వారు వైఎస్సార్‌సీపీ వైపు సవాల్‌కు సై అంటున్నా పందాలు కాచే వారు కానరాని పరిస్థితి జిల్లాలో కనిపిస్తోంది. చంద్రబాబు సొంత సామాజికవర్గం సిండికేట్‌గా మారి బెట్టింగ్‌లు వేసే వాతావరణం జిల్లాలో వేళ్లూనుకుంది. ఐదేళ్లుగా సంక్షేమ పాలనను అన్నివర్గాలకు చేరువ చేసిన జగనన్న ప్రభుత్వానికి తిరిగి పట్టం కట్టేలా పోలింగ్ సరళి ఉందన్నది సర్వేలు, విశ్లేషణల సారాంశం. కూటమికి ఓటేసిన వారు రోడ్లెక్కి హల్‌చల్ చేస్తున్నట్టుగా వాతావరణం ఉండగా.. ఫ్యాన్‌కు ఓటేసిన వారు నిశ్శబ్ద విప్లవాన్ని మరోసారి తెచ్చేలా సైలెంట్‌గా ఉన్నారని, పోలింగ్ బూత్‌ల వద్ద క్యూలు, అర్ధరాత్రి వరకు సాగిన పోలింగ్ సరళి ఇందుకు నిదర్శనం అని అంటున్నారు. అధికార పార్టీకి ఓటేసిన వారు సైలెంట్‌గా ఉండగా, కూటమికి ఓటేసిన వారు హంగామాతో పందాలను చేజిక్కించుకొని లబ్ధి పొందాలని చూస్తున్న వాతావరణం జిల్లాలో నెలకొంది.

రెండు రోజులుగా మారిన పరిస్థితి

2019 ఎన్నికలతో పోలిస్తే ప్రస్తుతం ఫలితాలపై బెట్టింగ్‌లు వేయడానికి చాలా మంది జంకుతున్నారు. నియోజకవర్గంలోని స్థానిక పరిస్థితులు, పోలింగ్ సరళి, తాయిలాల పంపిణీలను ఆధారంగా చేసుకుని నియోజకవర్గ ఫలితం, గ్రామాల వారీ ఆధిక్యతలు, వార్డుల్లో బూత్‌ల వారీ ఆధిక్యాలు ఎలా ఉంటాయనే స్థాయిలోనే పందాలు ఎక్కువగా జరుగుతున్నాయి. మెజార్టీపై పందాల కంటే సీటు పందాలు, జిల్లాలో గెలిచే స్థానాలు, రాష్ట్రంలో ఏ ప్రభుత్వం ఏర్పడుతుంది, ఎన్ని సీట్లతో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తారు, మేజిక్ ఫిగర్ దాటి ఎన్ని సీట్లు రావచ్చు అనే కోణంలో ప్రధానంగా పందాలు సాగుతున్నాయి. గతంలో మాదిరి ఆస్తులను పణంగా పెట్టి పందాలు వేసే వాతావరణం జిల్లాలో లేదు. పార్టీల సానుభూతిపరులుగా అభ్యర్థుల వెంట క్రియాశీలకంగా తిరిగిన వారు ఎక్కువగా బెట్టింగులు వేస్తున్నారు. రెండు రోజులుగా తిరిగి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే వస్తుందనే కోణంలోనే ఎక్కువగా పందాలు జరుగుతున్నట్టు సమాచారం.

ఇతర నియోజకవర్గాలపైనా.. పందెం రాయుళ్ల హాట్ ఫేవరేట్‌గా పిఠాపురం నిలుస్తోంది. అక్కడ పోటీలో ఉన్న పవన్ కల్యాణ్, వంగా గీతలో ఎవరు గెలుస్తారు.. గెలిస్తే ఎంత మెజార్టీ వస్తుందన్న దానిపై పందెం కాస్తున్నారు. గత ఎన్నికల్లో భీమవరం, గాజువాకలో పోటీ చేసి పవన్ కల్యాణ్ ఓడిపోవడంతో ఈసారి గెలిచి అసెంబ్లీలో అడుగుపెడతారా? లేక అలవాటైన రీతిలో ఓడిపోతారా? అని ఆరా తీస్తున్నారు. మంగళగిరి, హిందూపురం, కుప్పం స్థానాలపైనా పందేలు నడుస్తున్నాయి. కుప్పంలో చంద్రబాబుకు మెజార్టీ తగ్గుతుందని పందెం కాయడానికి ఎక్కువ ఆసక్తి కనబరుస్తున్నట్లు పందెం రాయుళ్లు చెబుతున్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


కిరణ్‌బాబు మృతదేహం

పోలవరం రూరల్: మండలంలోని ఎల్ఎన్ డీపేట గ్రామంలో ఒక వీధిలో రోడ్డుపై నిలిపి ఉంచిన వాటర్ ట్యాంకర్‌ను ఢీకొని ఒక యువకుడు మృతిచెందాడు. పోలవరం ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఎల్ఎన్‌డీపేట గ్రామానికి చెందిన కాసాని కిరణ్‌బాబు(35) అనే యువకుడు శుక్రవారం తెల్లవారుజామున ఇంటి వద్ద నుంచి మోటార్‌సైకిల్‌పై వెళుతుండగా, ప్రమాదవశాత్తు అక్కడే నిలిపిన వాటర్ ట్యాంకర్‌ను ఢీకొన్నాడు. దీంతో కిరణ్‌బాబుకు తీవ్ర గాయాలు కాగా, స్థానికులు 108 వాహనంలో కిరణ్‌బాబును పోలవరం వైద్యశాలకు తరలిస్తుండగా, మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి భార్య భవానీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ తెలిపారు.

పిచ్చికుక్క దాడిలో ఐదుగురికి గాయాలు

పాలకొల్లు అర్బన్: మండలంలోని కొత్తపేటలో శుక్రవారం పిచ్చికుక్క స్వైర విహారం చేసి, ఐదుగురు వ్యక్తులపై దాడి చేసింది. దీంతో స్థానిక యువజనులు పిచ్చికుక్క వెంటపడి తరిమికొట్టి చంపేశారు. గెద్దాడ కిరణ్‌కుమార్, గొల్లమందుల యోబు, బద్దె వజ్రమ్మతో మరో ఇరువురు పిచ్చికుక్క కాట్లకు గురయ్యారు. వీరంతా పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి వెళ్లి వైద్య చికిత్స పొందారు.

బ్యాంకులో గుండెపోటుతో మహిళ మృతి

తణుకు: పట్టణంలోని ఒక బ్యాంకుకు వచ్చిన మహిళ గుండె పోటుతో మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. తణుకు మండలం దువ్వ గ్రామానికి చెందిన ఆలపాటి లక్ష్మీ నారాయణమ్మ (55) తన భర్తతో కలిసి జిల్లా సహకార బ్యాంకు తణుకు బ్రాంచ్‌కి వచ్చారు. ఈ క్రమంలో బ్యాంకు ఆవరణలో కూర్చున్న లక్ష్మీనారాయణమ్మ గుండెపోటుతో కుప్పకూలిపోయింది.దీంతో ఆమె సంఘటనా స్థలంలోనే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు చెప్పారు.

పాల వ్యాన్‌ను ఢీకొట్టి వ్యక్తి మృతి

కామవరపుకోట: ఆగి ఉన్న పాలవ్యాన్‌ను వెనక నుండి ఢీ కొట్టి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో గండిగూడెం గ్రామంలో చోటు చేసుకుంది. తడికలపూడి ఎస్సై జయబాబు తెలిపిన వివరాల ప్రకారం లింగపాలెం మండలం శింగగూడెం గ్రామానికి చెందిన ఉమ్మడి దుర్గారావు (42) గురువారం ఉదయం ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై బయలుదేరి తడికలపూడి గ్రామపంచాయతీ వేంపాడు బంధువులు ఇంటికి వెళ్లి అదే రాత్రి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా మండలంలోని కళ్ళచెరువు గ్రామ పంచాయతీ గండిగూడెం గ్రామ శివారు వచ్చేసరికి రోడ్డు పక్కన ఆగి ఉన్న పాల వ్యాన్‌ను వెనుక నుండి ఢీ కొట్టాడు. ఘటనలో దుర్గారావుకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడకు అక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై జయబాబు తెలిపారు.


పుస్తక పఠనంలో నిమగ్నమైన విద్యార్థులు


యోగాసనాలు వేస్తున్న చిన్నారులు


భీమవరంలో చెస్, క్యారమ్స్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

సెలవులు సద్వినియోగమయ్యేలా..

- విద్యార్థులకు గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు
- రోజూ ఉదయం 8 నుంచి 11.30 గంటల వరకు
- వచ్చే నెల 7వ తేదీ వరకు తరగతుల కొనసాగింపు
- ఉమ్మడి పశ్చిమలోని 74 గ్రంథాలయాల్లో నిర్వహణ


విద్యార్థులకు డ్యాన్స్ నేర్పిస్తున్న దృశ్యం

భీమవరం: వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా.. విజ్ఞానం, క్రీడలపై కొంత సమయం కేటాయించేలా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లావ్యాప్తంగా శాఖా గ్రంథాలయాల్లో ప్రత్యేక వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తున్నారు. గతంలో గ్రంథాలయాలు అంటే కేవలం పుస్తక పఠనానికి మాత్రమే పరిమితం కాగా ప్రస్తుతం విజ్ఞాన, వ్యక్తిత్వ వికాస కేంద్రాలుగా విరాజిల్లుతున్నాయి. దీనిలో భాగంగానే విద్యార్థులకు పలు అంశాల్లో శిక్షణలు ఇస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 74 శాఖా గ్రంథాలయాలు ఉండగా వాటన్నింటిలో ఈనెల 15 నుంచి వచ్చేనెల 7వ తేదీ వరకు విజ్ఞాన తరగతులు కొనసాగనున్నాయి. వాస్తవంగా వేసవి శిక్షణ తరగతులు ఏప్రిల్ 29న ప్రారంభం కావాల్సి ఉండగా, సార్వత్రిక ఎన్నికల కారణంగా ఈనెల 15న ప్రారంభమయ్యాయి. రోజూ ఉదయం 8 గంటల నుంచి 11.30 గంటల వరకు నిర్వహిస్తున్న విజ్ఞాన తరగతులకు విద్యార్థులు ఉత్సాహంగా హాజరవుతున్నారు.

పలు అంశాల్లో శిక్షణ

వేసవిలో విద్యార్థులకు డ్యాన్స్, యోగా, చదరంగం, క్యారమ్స్ వంటి వాటిలో శిక్షణ ఇవ్వడంతో పాటు కథలు చెప్పడం, పుస్తక పఠనం ఎలా అనే అంశాలను నేర్పిస్తున్నారు. తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు స్నాక్స్, మజ్జిగ ప్యాకెట్లు ఇస్తున్నారు. అలాగే శిక్షణా తరగతులు సందర్భంగా విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించనున్నారు.

స్థానిక గురువుల సహకారంతో..

వేసవి శిక్షణా తరగతుల నిర్వహణకు ప్రభుత్వం నుంచి ఒక్కో గ్రంథాలయానికి సుమారు రూ.10 వేల వరకు అందిస్తుండగా వీటిని విద్యార్థులకు స్నాక్స్, మజ్జిగ ప్యాకెట్ల కొనుగోలు కోసం వెచ్చిస్తున్నారు. అలాగే పలు అంశాల్లో శిక్షణ ఇవ్వడానికి స్థానికంగా ఆయా రంగాల్లో నిష్ణాతులైనవారి సహకారం తీసుకుంటున్నారు. చెస్, క్యారమ్స్, యోగా, డ్యాన్స్ వంటి వాటిలో అనుభవజ్ఞులతో శిక్షణ ఇప్పిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో ఉపాధ్యాయులు సహకారం కూడా తీసుకుంటున్నారు. వీరంతా ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు.

కోచ్‌ల సహకారంతో శిక్షణ



గ్రంథాలయాల్లో నిర్వహించే వేసవి విజ్ఞాన తరగతులకు విద్యార్థులు ఉత్సాహంగా హాజరవుతున్నారు. ప్రతి ఏటా వేసవి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నాం. డ్యాన్స్, యోగా, చెస్, క్యారమ్స్ వంటి క్రీడల్లో శిక్షణ ఇవ్వడానికి స్థానికంగా కోచ్‌లు సహకరిస్తున్నారు. విజ్ఞాన తరగతుల ముగింపు సందర్భంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందిస్తాం.

–ఎస్.వెంకటేశ్వరరావు, గ్రంథాలయాధికారి, భీమవరం

'మారణహోమానికి వ్యతిరేకంగా గొంతెత్తుదాం'


సదస్సులో మాట్లాడుతున్న ప్రసాద్

ఏలూరు (టూటౌన్): గాజాలో మారణహోమానికి వ్యతిరేకంగా గొంతెత్తుదాం అని భారత కార్మిక సంఘాల సమైక్య(ఇఫ్టూ) రాష్ట్ర అధ్యక్షుడు పి.ప్రసాద్ పిలుపునిచ్చారు. స్థానిక ఇఫ్టూ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన రాష్ట్ర సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.జియోనిస్ట్ ఇజ్రాయిల్ పాలకులు పాలస్తీనాను దురాక్రమిస్తున్నారని అన్నారు. పాలస్తీనా ప్రజల జాతి ఆకాంక్షలను అణచివేస్తున్నారని దీని కోసం పాలస్తీనాపై బాంబు, వైమానిక దాడులు చేస్తూ మారణహోమాన్ని సృష్టిస్తున్నారన్నారు. ఈ మారణ హోమానికి వ్యతిరేకంగా పోరాడుతున్న పాలస్తీనా ప్రజలను దుర్మార్గంగా అణిచివేస్తున్నారన్నారు. ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షులు రామ్మోహన్ మాట్లాడుతూ గాజాలో ఇప్పటి వరకూ 35వేల మంది ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌లో ఇజ్రాయిల్ సాయుధ బలగాల చేతుల్లో వందలాది మంది పాలస్తీనీయన్లు బలయ్యారన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భాస్కర్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కాకి నాని, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆది, రాష్ట్ర సహాయ కార్యదర్శి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణతోనే మానవ మనుగడ


వేద సభలో వేదికపై స్వామి, అమ్మవార్లు


వేద సభను నిర్వహిస్తున్న పండితులు, ఆగమ విద్యార్థులు

ద్వారకాతిరుమల: హిందూ ధర్మ పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని అర్చకులు, పండితులు ఉద్ఘోదించారు. శ్రీవారి నిత్యకల్యాణ మండపంలో ఆలయ అధికారులు, అర్చకులు, పండితులు శుక్రవారం సాయంత్రం వేద సభను ఘనంగా నిర్వహించారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో రథోత్సవం జరిగిన మరుసటి రోజు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ఇక్కడ సంప్రదాయంగా వస్తోంది. ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఆలయం నుంచి తొళక్క వాహనంపై మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ నిత్యకల్యాణ మండపం వద్దకు తీసుకొచ్చారు. ఆ తరువాత కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన రజిత సింహాసనంపై కల్యాణ మూర్తులను ఉంచి విశేష పుష్పాలంకరణ చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు దంపతులు అందించిన వివిధ రకాల ఫలాలను, పుష్పాలను స్వామివారి ముందు ఉంచారు. శ్రీవారు, అమ్మవార్లు కొలువైన వేదిక ముందు అర్చకులు, వేద పండితులు, అధికారులు, ఆగమ విద్యార్థులు కొలువు తీరారు. ఈ సందర్భంగా వారు స్వామి, అమ్మవార్ల గుణగణాలను కీర్తిస్తూ వేద మంత్రోచ్ఛరణలు జరిపారు. అనంతరం శ్రీవారు, పద్మావతి, ఆండాళ్ అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు అర్చకులు హారతులిచ్చి, నీరాజన మంత్రపుష్పాలను సమర్పించారు. ఆఖరిలో అర్చకులు, పండితులను ఆలయ ఈఓ త్రినాథరావు ఘనంగా సత్కరించారు.

వృద్ధురాలి మెడలో ఐదు కాసుల గొలుసు చోరీ

కామవరపుకోట: ఇద్దరు యువకులు దాహం వేస్తుందని, మంచినీళ్లు ఇవ్వమని, వృద్ధురాలి మెడలో 5 కాసుల బంగారు గొలుసు అపహరించిన ఘటన చిన్నమ్మరావుపాలెంలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలు ప్రకారం మండలంలోని ఆడమిల్లి గ్రామ పంచాయతి చిన్నమ్మారావుపాలెం గ్రామానికి చెందిన కమ్మ తులసమ్మ శుక్రవారం మధ్యాహ్నం తన ఇంటి ఆవరణలో కూర్చుని ఉండగా, ద్విచక్ర వాహనంపై ఇద్దరు యువకులు వచ్చి ఆ వృద్ధురాలిని మంచినీళ్లు కావాలని అడిగారు. ఆమె లోపలకు వెళ్లే ప్రయత్నం చేస్తుండగా ఒకడు ఆమె మెడలో నుంచి బంగారం గొలుసు లాగేశాడు, ఆ సమయంలో ఆమె ఆ యువకులను ప్రతిఘటించే ప్రయత్నం చేసినా వారు వృద్ధురాలిని తోసేసి, ద్విచక్ర వాహనంపై దొంగలిద్దరు ఆడమిల్లి మీదుగా కామవరపుకోట వైపు వెళ్లిపోయారు. ఈ సంఘటనపై తడికలపూడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. దొంగిలించిన బంగారం విలువ సుమారు రు. 2 లక్షలకు పైనే ఉంటుందని బాధితులు వాపోతున్నారు.

బాస్కెట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి పశ్చిమ జయకేతనం


యూత్ బాస్కెట్‌బాల్ పోటీల్లో విజేతగా నిలిచిన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జట్టు



మూడోస్థానంలో నిలిచిన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బాలికల జట్టు

ఏలూరు రూరల్: అంతర జిల్లాల యూత్ బాస్కెట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బాలుర జట్టు విజేతగా నిలిచింది. విజయవాడలో స్టెల్లా కాలేజ్ ఆవరణలో నాలుగురోజులుగా ఏడో రాష్ట్రస్థాయి యూత్ బాస్కెట్‌బాల్ పోటీలు జరుగుతున్నాయి. ఈ పోటీల్లో పాల్గొన్న జిల్లా బాలుర జట్టు వరుస విజయాలతో ఫైనల్‌కు చేరింది. శుక్రవారం సాయంత్రం జరిగిన తుదిపోరులో తూర్పు గోదావరి జిల్లా జట్టును ఢీ కొట్టింది. ఫ్లడ్‌లైట్స్ వెలుగుల్లో జరిగిన మ్యాచ్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. ఆట ప్రారంభమైన మొదట రెండు క్వార్టర్ సమయం 20 నిమషాల్లో జిల్లా బాలురు అద్భుత డిఫెన్స్‌తో పాటు డ్రిబ్లింగ్, పాసింగ్, షూటింగ్‌తో 29–18 స్కోర్ సాధించి ప్రత్యర్థి జట్టుపై పైచేయి సాధించింది. మూడో క్వార్టర్‌లో 48–36 స్కోర్ సాధించి, నాలుగో క్వార్టర్‌లో దూకుడు ప్రదర్శించి 62–51 స్కోర్‌తో జిల్లా జట్టు విజేతగా నిలిచింది. దీనికి ముందు పోటీల్లో అనంతపురం, కృష్ణ, విశాఖ జట్లను మట్టి కరిపించి ఫైనల్‌కు చేరింది.

మూడోస్థానంలో నిలిచిన బాలికల జట్టు

తృతీయస్థానంలో బాలికలు

మరో పక్క వరుస విజయాలతో దూసుకుపోయిన జిల్లా బాలికల జట్టుకు సెమీ ఫైనల్‌లో బ్రేక్ పడింది. తూర్పుగోదావరి జిల్లా జట్టు చేతిలో 63–52 స్కోర్‌తో ఓటమి పాలై మూడో స్థానంతో సరిపెట్టుకుంది. టోర్నమెంట్‌లో అద్భుత ప్రతిభ ప్రదర్శించి జిల్లా ప్రేరు, ప్రఖ్యాతలు తీసుకొచ్చారని ఉమ్మడి పశ్చిమగోదావరి బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, కార్యదర్శి గవ్వ శ్రీనివాస్, కోశాధికారి కె.మురళీకృష్ణ ఇరుజట్లను అభినందించారు.

ఉగాది జాతీయస్థాయి నాటికగా ఇంద్రప్రస్థం

తాడేపల్లిగూడెం (టీటీసీ): తాడేపల్లిగూడెం పట్టణంలోని బీవీఆర్ కళాకేంద్రంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి 31వ ఉగాది నాటికల పోటీలు ప్రేక్షకులను అలరిస్తున్నాయి. బీవీఆర్ కళా కేంద్రం వ్యవస్థాపక అధ్యక్షులు బుద్దాల వెంకట రామారావు నాటిక పోటీల విజేతల వివరాలను శుక్రవారం వెల్లడించారు. ఉత్తమ ప్రదర్శనగా అభినయ ఆర్ట్స్ గుంటూరు వారి ఇంద్రప్రస్థం నాటిక నిలిచింది. ఉత్తమ ద్వితీయ నాటికగా విశాఖపట్నం తెలుగు కళా సమితి వారి నిశబ్దమా నీ ఖరీదెంత ? ఉత్తమ తృతీయ నాటికగా వెలగలేరు థియేటర్ ఆర్ట్స్ వారి రాత, జ్యూరీ ప్రదర్శనలుగా హైదరబాద్ సిరిమువ్వ కల్చరల్ థింక్, కొలకలూరు శ్రీ సాయి ఆర్ట్స్ వారి కౌసల్యా సుప్రజారామ, ఉత్తమ రచనలుగా ఇంద్రప్రస్థం, స్నిగ్ధ, ఉత్తమ దర్శకత్వం, ఉత్తమ నటుడిగా ఇంద్రప్రస్థం నాటికలో ఎస్.రవీంద్ర రెడ్డి, ఉత్తమ నటిగా అమృతహస్తంలోని మాలతి పాత్రలోని మాధవి, ద్వితీయ ఉత్తమ నటిగా స్వప్నం రాల్చిన అమృతంలో జ్యోతిరాణి (సుగుణ), ఉత్తమ ప్రతి నాయకుడిగా అమృతహస్తం నాటికలో ఏపూరి హరిబాబు, ఉత్తమ హాస్య నటుడిగా నిశబ్దమా నీ ఖరీదెంతలో వామనరవు, (కన్నబాబు), ఉత్తమ బాల నటిగా రాత నాటికలో స్వప్నిక, ఉత్తమ సహాయ నటుడిగా కౌసల్యా సుప్రజారామలో సీతారాం (విజయ్), ఉత్తమ సహాయ నటిగా ఇంద్రప్రస్థంలో సౌందర్య పాత్ర జి.నాగ కుసుమసాయి, ఉత్తమ సంగీతం రాతలో సురభి నాగరాజు, ఉత్తమ ఆహార్యం రాతలో శివ ప్రసాద్, ఉత్తమ రంగాలంకరణ ఇంద్రప్రస్థంలో ఫణి, ఉత్తమ రంగోద్దీపనంగా కౌసల్యా సుప్రజారామ, జ్యూరీ అవార్డులు కొత్త తరం కొడుకు శ్రీరామచంద్రయ్య, డి.ఉమాశంకర్, రైతే రాజులో రైతు వెంకన్న (భుజంగరావు), న్యాయ నిర్ణేతలుగా ఆకుల మల్లేశ్వరరావు, కత్తుల రామ్మోహన్‌రావు, వి.వేణుగోపాల్ వ్యవహరించారు.

రైతులను నిండా ముంచేసిన ధాన్యం వ్యాపారి


ధాన్యం వ్యాపారి చంద్రశేఖర్ ఇంటి వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

దాదాపు రూ.4 కోట్లు ఎగ్గొట్టాడని రైతుల ఆవేదన

నూజివీడు: ఆరుగాలం కష్టపడి పండించిన పంటను ధాన్యం వ్యాపారికి విక్రయించగా ఆ వ్యాపారి రైతులను నిండా ముంచేసి ఊరు నుంచి వెళ్లిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. తమకు న్యాయం ఎవరు చేస్తారని ఆవేదన చెందుతున్నారు. ధాన్యం వ్యాపారి ఇంటి వద్ద శుక్రవారం రైతులంతా కలిసి ఆందోళనకు దిగారు. నూజివీడు మండలం అన్నవరం గ్రామానికి చెందిన మల్లూరు చంద్రశేఖర్, మల్లూరు సురేష్ అనే వ్యాపారులు ఇద్దరూ అన్నదమ్ములు. వీరిద్దరూ కలిసి అన్నవరం, ముక్కొల్లుపాడు, సుంకొల్లు, దిగవల్లి, ముసునూరు మండలం సూరేపల్లి గొల్లగూడెం, చాట్రాయి మండలం సోమవరం, తుమ్మగూడెం ప్రాంతాల్లో ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు చేశారు. రైతుల వద్ద నుంచి గత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ధాన్యాన్ని డిసెంబరు, జనవరి నెలల్లో దాదాపు 400 మంది రైతుల వద్ద నుంచి ధాన్యంను కొనుగోలు చేశారు. అయితే అప్పటి నుంచి రైతులు తమకు రావాల్సిన డబ్బుల కోసం తిరుగుతుంటే వాయిదాలు పెడుతూ వచ్చి డబ్బులు ఇవ్వకుండా ఐదు నెలలు గడిపారు. రైతులకు దాదాపు రూ.4 కోట్ల పైన నగదు చెల్లించాల్సి ఉంది. ఈ పరిస్థితుల్లో ఈనెల 15న మల్లూరు చంద్రశేఖర్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి తిరుపతి, కాణిపాకం వెళ్లి వస్తానంటూ అందరూ వెళ్లిపోయారు. ఈ విషయం తెలిసి రైతులు ఆయన ఇంటి వద్దకు వచ్చి అతని తమ్ముడైన సురేష్‌ను తమకు చెల్లించాల్సిన నగదు విషయమై అడుగుతుంటే తాను కేవలం లెక్కలు రాసేందుకు మాత్రమే ఉన్నానని, మా అన్నయ్య ఎవరికి ఎంత ఇవ్వాలో? తనకు తెలియదని పేర్కొన్నాడు. వారం రోజుల్లో వస్తానని వెళ్లాడని ఇంత వరకు రాలేదని పేర్కొంటున్నాడు. చంద్రశేఖర్ ఫోన్ నెంబరు స్విచ్ ఆఫ్ వస్తోందని, మరో నెంబరుకు ఫోన్ చేస్తే రింగవుతుంది గాని ఎవరూ ఎత్తడం లేదని రైతులు చెబుతున్నారు. ముసునూరు మండలం సూరేపల్లికి చెందిన ముల్లంగి సుధారాణి తాము కౌలుకు తీసుకొని పంట పండించి ధాన్యం కాటా వేయగా రూ.2 లక్షలు ఎగ్గొట్టి వెళ్లిపోయాడని, తాను పిల్ల పెళ్లి పెట్టుకున్నానని వాపోయింది. ఇలా పలువురు రైతులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు. ఈ మేరకు రైతులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ధాన్యం వ్యాపారిపై ఫిర్యాదు చేశారు.